పల్లెల్లోనూ బెట్టింగ్ జోరు

- అంతా స్మార్ట్ ఫోన్లలోనే..
- మోసపోతున్న యువత
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు



నందిపేట్(ఆర్మూర్): నగరాలు, పట్టణాలకు పరిమితమైన బెట్టింగ్, ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల పుణ్యాన పల్లెల్లోనూ కొనసాగుతుంది. గతంలో బెట్టింగ్‌లు చేయాలంటే బుకీలు ఒక కేంద్రంగా ఏర్పడి గుట్టుగా నిర్వహించేవారు. ఆ స్థావరం సమాచారం పోలీసులకు అందితే వారిని సులభంగా పట్టుకునేవారు. ప్రస్తుతం బెట్టింగ్ దందా మొత్తం ఫోన్‌లోనే కొనసాగుతోంది. చేతిలో ఫోన్, అకౌంట్‌లో డబ్బులు ఉంటే చాలు. పట్నం, పల్లె అన్న తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ జోరుగా కొనసాగుతుంది.

బెట్టింగ్ సాగేదిలా..

ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభంలో బుకీల ఫోన్లు ఆరంభమవుతాయి. ముందుగా వారు సూచించిన అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలి. తర్వాత పోటీ పడుతున్న రెండు జట్ల బలాబలాల ప్రకారం బెట్టింగ్ ఉంటుంది. బలమైన జట్టుతో బలహీనమైన జట్టు పోటీలో ఉంటే బలహీనమైన జట్టు గెలుస్తుందని బెట్టింగ్ కాస్తే ఒకటికి రెండు, మూడు రెట్ల డబ్బులు చెల్లిస్తారు. మ్యాచ్ జరుగుతున్నంత సేపు బెట్టింగ్‌ను జట్లలో ఏ వైపుకైనా మార్చుకునే అవకాశం ఉంటుంది. అలాగే బాల్ బాల్‌కి కూడా బెట్టింగ్ పెట్టుకోవచ్చు. బంతిని సిక్స్ కొడతాడా? ఫోర్ కొడతాడా? వికెట్ పడుతుందా? అనే అంశాలపై బెట్టింగ్ కొనసాగుతుంది. ఈ తతంగంలో స్మార్ట్‌ఫోన్లలోనే డబ్బులు చెల్లింపులు జరుగుతాయి. గెలిచిన వారికి మాత్రం డబ్బులు సీక్రెట్‌గా అందజేస్తారు.

ప్రత్యేక కోడ్ భాష

బెట్టింగ్ నిర్వాహకులు ప్రత్యేక కోడ్ భాషను ఉపయోగిస్తారు. అలాగే ప్రత్యేక యాప్‌ను సృష్టించి వ్యవస్థను ఏర్పాటు చేసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఫోన్ ద్వారా జరిగే బెట్టింగ్‌ను నిరోధించడం పోలీస్ వ్యవస్థకు సవాలుగా మారింది. స్థావరాలు నిఘా వ్యవస్థకు అంతుచిక్కడం లేదు. బెట్టింగ్ వ్యవహారాల్లో డబ్బుల కోసం, జల్సాల కోసం పలువురు విద్యార్థులు, యువకులు పక్కదారి పడుతూ తల్లిదండ్రులకు కన్నీటిని మిగులుస్తున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు మేల్కొని తమ పిల్లలు బెట్టింగ్‌ల బారిన పడకుండా జాగ్రత్త పడాలి. అధికారులు సైతం తగిన నిఘా ఉంచి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రులు నిఘా పెట్టాలి

స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ రమ్మీ, క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారు. పిల్లలపై నిత్యం తల్లిదండ్రులు నిఘా పెట్టాలి. రాత్రి సమయంలో తొందరగా ఇళ్లకు చేరేలా చూడాలి. ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. – రాహుల్, ఎస్సై, నందిపేట

ఇండియా కూటమికే అధికారం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు


బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు

బోధన్: లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమికే అధికారం దక్కుతుందని భావిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు జోస్యం చెప్పారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి పదేళ్ల పాలన కాలంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. బీజేపీ మూడో సారి మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవని పేర్కొన్నారు. బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కుల, మతం, ప్రాంతాల పేరుతో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. పార్టీ జిల్లా, డివిజన్ ప్రతినిధులు యేశాల గంగాధర్, శంకర్‌గౌడ్, జంగం గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు


సునీల్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

భీమ్‌గల్/బాల్కొండ: భీమ్‌గల్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలతో పాటు ముప్కాల్ మండలం వేంపల్లి, నాగంపేట గ్రామాల తాజా మాజీ ఉప సర్పంచులు జక్క గంగాధర్, చిట్టెన్న, వేంపల్లి బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మలారి గంగాధర్‌తో పలువురు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో జీవన్ రెడ్డి ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. భీమ్‌గల్ టౌన్ అధ్యక్షుడు జేజే నర్సయ్య, కాంగ్రెస్ నేత గడుగు గంగాధర్, ముప్కాల్ మండల అధ్యక్షుడు ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోనూ అధికారంలోకి వస్తాం

- నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

బోధన్‌రూరల్/మాక్లూర్: కేంద్రంలో ఈ సారి ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రవి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో, మాక్లూర్ మండల కేంద్రంలోని రఫత్ ఖాన్ గార్డెన్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ప్రజలకు సేవ చేసేందుకు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాను ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ మీద కోపంతో జిల్లా ప్రజలు అర్వింద్‌ను ఎంపీ గెలిపించారన్నారు. ఎంపీ అర్వింద్ జిల్లా చేసిందేమీ లేదని విమర్శించారు. తనకున్న రాజకీయ అనుభవాన్ని పెట్టుబడిగా పెట్టి ఇందూరును అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరు వినయ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బీన్ ఉందన్, ఆకుల లలితలు మాట్లాడారు. మాక్లూర్ మండలంలోని వల్లభాపూర్ సర్పంచ్ మంజుల సుధాకర్, ఉప సర్పంచ్ పి గంగాధర్, మెట్పల్లి సర్పంచ్ చిన్ రెడ్డి, గొట్టిముక్కుల సర్పంచ్ దారం ప్రవీణ్, మాందాపూర్ సర్పంచ్ సుశీల గంగాధర్, సింగంపల్లి ఉపసర్పంచ్ రామ్, మామిడిపల్లి ఎంపీటీసీ ఎం సత్యనారాయణతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం: సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతాంగానికి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఈ ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు రూ.15 వేలు రైతు భరోసా అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో పింఛన్లు రూ.4 వేలు అందిస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల వల్ల దేశానికి, రాష్ట్రానికి మేలు జరగదని అన్నారు. నిజామాబాద్ ఎంపీగా జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీ బుద్దె సావిత్రి, మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, మాజీ ఎంపీపీ గంగాశంకర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నేతలు మందర్న రవి, తూము శరత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం అందజేస్తున్న నేతలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌పై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంజయ్ తల్గారే డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎంఈవో నాగ్‌నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడారు. గురువారం అంబేద్కర్ చౌరస్తా వద్ద రైల్వే గేట్ పడుతున్నా పాఠశాల బస్సు డ్రైవర్ బస్సును నిలపకుండా రైల్వే ట్రాక్‌పై బస్సును నిలిపేశాడని, అప్పటికి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోందని, అక్కడి ప్రజలు డ్రైవర్‌ను తిట్టడంతో బస్సును ముందుకు తీశాడని దీంతో ప్రమాదం తప్పిందన్నారు. బస్సులో విద్యార్థులు ఉన్నా డ్రైవర్ ఇంత నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. గతంలో సైతం ఇదే పాఠశాలకు చెందిన బస్సు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లిందని, అప్పుడు సైతం బస్సులో 40 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఇలా నిర్లక్ష్యంగా ఉన్న డ్రైవర్లను పెట్టుకున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రం అందించారు.

ఉపాధి హామీ కూలీలకు పరికరాలు అందించాలి



కమ్మర్‌పల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పరికరాలు అందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కిషన్, కోశాధికారి బి.అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పించడంతో పాటు, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ఆటో చార్జీలు ప్రభుత్వమే భరించాలని కోరారు. నాయకులు సత్తెక్క తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



బోధన్‌టౌన్ (బోధన్): అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా సూపర్ మార్కెట్, సినిమా హాళ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలల్లో అగ్ని ప్రమాద నివారణ సామగ్రిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక కేంద్ర అధికారి గంగాదాస్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల రిలయన్స్ మార్ట్‌లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలను గురించి సిబ్బందికి వివరించారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చేసిందేమీ లేదు'


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధిని తాను చూసుకుంటానని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం రుద్రంగి మండలం మానాల కీమా నాయక్ తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు, యువకులతో మాట్లాడారు. కీమా నాయక్ తండాలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి మాత్రమే ఉందని, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు చేసిందేమీ లేదని విమర్శించారు. పదేళ్లుగా కీమా నాయక్ తండా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎంపీగా జీవన్‌రెడ్డి గెలిపిస్తే తండా అభివృద్ధిని తాను చూసుకుంటానని అన్నారు. పార్టీ ఓబీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జక్కు వంశీ, నాయకులు జక్కు మోహన్, రఘుపతి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేసి గెలిపించాలి


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 32, 33 వార్డులలోని 63, 67 బూత్‌లలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మోదీ హయాంలో బడుగు బలహీన వర్గాల కోసం అందిస్తున్న సంక్షేమ ఫలాలను, అభివృద్ధి పనుల గురించి వివరించారు.

మోదీని మరోసారి ప్రధానిగా ఎన్నుకోండి

నందిపేట్(ఆర్మూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మరోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీని ఎన్నుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. నందిపేటలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్మించిన ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పాల్గొన్నారు. గ్రామంలో పిప్రి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, నాయకులు కంచెట్టి గంగాధర్, పాలెపు రాజు, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

నవీపేట: నవీపేట, కమలాపూర్ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా ఈ రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని నవీపేట, అభంగపట్నం, అబ్బాపూర్, స్టేషన్ ఏరియా, పోతంగల్, శివతండా, హనుమాన్ ఫారం, శ్రీరామ్ తండా, మహంతం, మోకన్‌పల్లి, రెడ్డిఫారం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

రెంజల్(బోధన్): సాటాపూర్ గ్రామంలోని సామియా గార్డెన్‌లో శనివారం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం ఉంటుందని మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరారెడ్డి, నాయకులు చిలుక అశోక్, పోచయ్య, క్రిష్ణలు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డిలు హాజరై ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తారని తెలిపారు.

23న వీర హనుమాన్ విజయ యాత్ర

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఈ నెల 23న వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్లు బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు శుక్రవారం తెలిపారు. మామిడిపల్లి హనుమాన్ ఆలయం నుంచి పట్టణంలోని గోల్ బంగ్లా వరకు విజయ యాత్ర చేపట్టనున్నట్లు వారు తెలిపారు. యాత్రకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం మామిడిపల్లి వీడీసీ సభ్యులకు అందజేశారు.

రోడ్‌షోను విజయవంతం చేయండి



రుద్రూర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రుద్రూర్ మండలంలో శనివారం నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్, బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. రుద్రూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాత, విండో చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – హ్యాపీడేస్ - 01.30, పారిజాతపర్వం - 4.50, లవ్ యూ శంకర్ - 7.45, మార్కెట్ మహాలక్ష్మి - 10.25
- స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) - 12.00, 3.00, 06.00, 9.00
- స్క్రీన్-3 – ది ఫ్యామిలీ స్టార్ -12.10, 6.40, గీతాంజలి మళ్లీ వచ్చింది - 3.25, టినెంట్ (తెలుగు)- 10.05
- స్క్రీన్-4 – మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 12.45, 3.45, 6.45, 9.54

క్లుప్తంగా

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నూతన రథం నిలపడానికి బ్రహ్మంగారి గుట్ట వద్ద చేపట్టే షెడ్డు నిర్మాణానికి గ్రామాభివృద్ధి కమిటీ, భక్తులు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, జడల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



బాల్కొండ: మండల కేంద్రంలోని అబుల్ ఫతే సయ్యద్ షా బందగీ బాద్‌షా ఖాద్రి ఉర్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మదర్స పాఠశాల నుంచి సందల్‌ను ఘనంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఫకీరులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆరోగ్య శిబిరానికి అపూర్వ స్పందన

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్, తెల రవికుమార్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపునకు మంచి స్పందన లభించింది. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. హెల్త్ క్యాంపును లయన్స్ గవర్నర్ పోలవరపు లక్ష్మీ బసవేశ్వర రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వల్లేపల్లి శ్రీనివాసరావ్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కొట్టం ఎంపీటీసీ మనోహర్, విండో చైర్మన్ కూచి సిద్దు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో చిలుకల చిన్నమ్మ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలూర్ మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి ఆవరణలో వీడీసీ ఆధ్వర్యంలో చిలుకల చిన్నమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దీంతో వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ పస్క నర్సయ్య, నాయకులు ముక్కెర విజయ్, నలిమెల మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' నీటి సరఫరాపై ఆరా



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీ, జిరాయత్ నగర్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంజనీర్ ఇన్ చీఫ్ హెల్త్ అధికారి ఆర్ శ్రీధర్ ఆరా తీశారు. వేసవి కాలంలో నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాలనీల్లో పర్యటిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ప్రజలకు తాగునీటి సరఫరా గురించి నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బాల్కొండ వద్ద గల నీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.రాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నగేష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



ఎడపల్లి(బోధన్): జానకంపేట శివారులోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో అభయ అరణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు వేదపండితుల సమక్షంలో పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ మస్తాన్ అలీ, సీఏఆర్ కమాండెంట్ శంకర్ నాయక్, సీఏఆర్ ఏసీపీ నాగయ్య, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో 11వ స్థానం

ఆర్మూర్‌టౌన్: ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే 11వ స్థానంలో ఆర్మూర్ మున్సిపాలిటీ ఉందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ప్రతి రోజు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని బిల్ కలెక్టర్లు సహకరించడం వల్లే సాధ్యమైందన్నారు. మిగిలిన 11 రోజుల్లో ఇంకా ఎక్కువ వసూళ్లు సాధించి రాష్ట్రంలోనే 5వ స్థానంలో ఉండే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట: మండలంలోని నిజాంపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పట్టుకున్నట్లు తహసీల్దార్ నారాయణ, ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇసుకను నింపుకుని నవీపేట వైపు వస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన సిద్దులగుట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన వినేశ్ ఆర్మూర్‌కు పని నిమిత్తం వచ్చాడు. సిద్దుల గుట్ట సమీపంలో వినేశ్ తన బైక్‌ను యూటర్న్ చేస్తున్న సమయంలో నిజామాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో వినేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది తిరుమలేశ్, రూపేశ్ ప్రథమ చికిత్స చేసి క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు నాన్ మైనారిటీ సీట్లను లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ బషీరుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 23లోపు అందజేయాలని కోరారు.

మట్కా రాయుళ్ల అరెస్ట్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గోశాల కాలనీలో మట్కా ఆడుతున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మట్కా ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసు సిబ్బందితో దాడి చేయగా సయ్యద్ వాజిద్, ఎండీ ఇలియాస్‌లు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 6,380 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

చెత్తకుప్పలో మంటలు

బోధన్‌టౌన్: పట్టణంలోని సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ బిల్డింగ్ వెనుక భాగం ఖాళీ స్థలంలో ఉన్న చెత్తకుప్పలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అగ్ని మాపక శాఖ అధికారికి సమాచారం అందించడంతో సిబ్బంది మంటలను ఆర్పివేశారు.